వేసవిలో నీటి ఎద్దడి ఉండొద్దు

- అభివృద్ధి పనులకు ఇసుక అనుమతులివ్వాలి
- ఎస్‌బీఐ ఏర్పాటు చేయాలని లింగంపేట సర్వసభ్య సమావేశంలో తీర్మానం


సమావేశంలో పాల్గొన్న లింగంపేట ఎంపీపీ గరీబున్నీసాబేగం, ప్రజాప్రతినిధులు, అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జెడ్పీటీసీ శ్రీలత అధికారులకు సూచించారు. సోమవారం లింగంపేట ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ గరీబున్నిసాబేగం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపట్టిన అభివృద్ధి నివేదికలు చదివి వినిపించారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ముందస్తుగా సర్పంచులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద 265 పనులు చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆసక్తి ఉన్నవారికి చేపల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి చెరువులు తవ్వించనున్నట్లు వెల్లడించారు. అలాగే మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించనున్నట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ఐవోబీ, దక్కన్ గ్రామీణ బ్యాంకులు మహిళా సంఘాలకు సరైన సేవలు అందించడం లేదన్నారు. మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. దాంతో ఎస్‌బీఐ కోసం తీర్మానం చేస్తున్నట్లు ఎంపీడీవో వివరించారు. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయితీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని సర్పంచులు కోరారు. పొల్కంపేట చౌదరి చెరువు గండి పూడ్చాలని ఎంపీటీసీ సభ్యుడు వెంకటి సభ దృష్టికి తెచ్చారు. మరికొన్ని చెరువులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయకట్టులో పంటల సాగు నిలిచిపోయిందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఇసుక అనుమతులు ఇవ్వాలని సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. తహసీల్దార్ అనుమతులు ఇచ్చినా అటవీశాఖ అధికారులు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేస్తున్నారన్నారు. అటవీ ప్రాంతం నుంచి ఇసుక తీసుకెళ్లడం లేదని వాగులో నుంచి తెచ్చుకున్నా తహసీల్దార్ అనుమతి ఉన్నా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో కొత్తగా 5 బ్రిడ్జిలకు ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ రాకేష్ తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారాయణ, వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, డైరెక్టర్లు ఫతియోద్దీన్, దేశ్యానాయక్, రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ట్రాన్స్‌కో ఏడీఈ తిరుపతిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

చెడిపోయిన పెరుగు విక్రయం

- ఆందోళన చేసిన బాధితులు


చెడిపోయిన పెరుగును చూపుతున్న బాధితులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కరీంనగర్ డైరీలో చెడిపోయిన పెరుగును విక్రయించారని బాధితులు సోమవారం ఆందోళన చేశారు. వివరాలు.. మండల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ డైరీ నుంచి ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం జరిగే వివాహ వేడుకలకు 30 కిలోల పెరుగు కొనుగోలు చేశారు. పెరుగు తీసుకొని తిమ్మాపూర్ గ్రామానికి తీసుకెళ్లి చూడగా ఫెవికోల్ లాగా సాగుతూ దుర్వాసన వచ్చింది. దీంతో పెరుగు బకెట్లను కరీంనగర్ డైరీకి తీసుకురాగా మార్కెటింగ్ మేనేజర్, బాధితులతో అసభ్యకరంగా మాట్లాడడంతో వారు ఆందోళనకు దిగారు. ప్రజలను మోసం చేస్తూ చెడిపోయిన పెరుగును ఎలా విక్రయిస్తారని నిలదీశారు. మార్కెటింగ్ మేనేజర్, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని చైర్మన్ హరీష్‌రావుకు ఫిర్యాదు చేశారు. మరోసారి ఇలా జరుగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పడంతో ఆందోళన విరమించారు.

బీజేపీలో పలువురి చేరిక


మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కన్నారెడ్డి గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కండువాలను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మర్కంటి పోచయ్య, సురేందర్‌తోపాటు ఆదర్శ యూత్ సభ్యులు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు నర్సింహారెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



భిక్కనూరు: సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పట్లూరి హన్మంత్ రెడ్డి, ఆయన సోదరుడు రవీందర్‌రెడ్డిలు సోమవారం రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ డబ్బులను వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేతుల మీదుగా రూ.50 వేల చెక్కును ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డికి అందజేశారు. అలాగే ప్రభుత్వ విప్ పీఏ శ్రీధర్ రూ.11 వేలను అందజేశారు.

వెండి కిరీటం వితరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలోని నల్ల పోచమ్మ అమ్మవారికి సోమవారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటకు చెందిన ఎర్ర పోచగౌడ్ అనే వ్యక్తి కిలో వెండితో చేయించిన కిరీటంతోపాటు అమ్మవారి చేతిలో ఉండేందుకు కత్తిని వితరణ చేశారు. ఈ మేరకు మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధుల సమక్షంలో వారు అమ్మవారికి కిరీటం, కత్తిని అలంకరింపజేశారు. అనంతరం పోచగౌడ్ దంపతులను సత్కరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బాన్సువాడ రూరల్: కోనాపూర్ జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం గ్రామ సర్పంచ్ వెంకటరమణారావు సందర్శించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పాటు భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

టీడీపీని బలోపేతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో టీడీపీని బలోపేతం చేయాలని టీడీపీ జిల్లా ఇన్‌చార్జి మహేశ్ అన్నారు. సోమవారం మర్కల్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ఇన్‌చార్జి కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో టీడీపీ జెండాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

మండలాధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ గ్రామానికి చెందిన జూకంటి రవీందర్‌రెడ్డిని టీడీపీ మండలాధ్యక్షుడిగా నియమించారు. ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టిన వడ్ల రాజేందర్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరడంతో రవీందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. పార్టీ గెలుపునకు కృషి చేస్తానని రవీందర్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి సాయం



రామారెడ్డి(ఎల్లారెడ్డి): తనకు చేతనైనంత సాయం చేస్తూ తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు రామారెడ్డి మండల రెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించే అంజనేయులు. సోమవారం రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి చేతుల మీదుగా వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలోని 84 మంది విద్యార్థులకు కావాల్సిన నోట్ పుస్తకాలను సోమవారం అందజేశారు. ఇప్పటి వరకు పాఠశాలకు కావాల్సిన పలు మౌలిక వసతుల కోసం రూ.లక్ష ఖర్చు చేసినట్లు ఉపాధ్యాయుడు అంజనేయులు తెలిపారు. ఉపాధ్యాయుడ్ని ఎంపీపీ దశరథ్‌రెడ్డి అభినందించారు. ఉపసర్పంచు స్వప్న బుచ్చిరెడ్డి, చంద్రునాయక్ పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వనదర్శిని

మద్నూర్(జుక్కల్): తెలంగాణ ప్రభుత్వం–అటవీ శాఖ చేపట్టిన వన దర్శిని కార్యక్రమంలో భాగంగా మేనూర్ మోడల్ స్కూల్‌కి చెందిన 64 మంది విద్యార్థులను మండలంలోని శేఖాపూర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా అడవి గురించి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేశ్ వివరించారు. అడవులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు ఆయన చెప్పారు.

స్వయం పాలన దినోత్సవం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అడివిలింగాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు.

నెమలి అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నెమలిపై కుక్కలు, పందులు దాడి చేసేందుకు సిద్ధంగా ఉండటంతో మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ వాటిని తరిమి నెమలిని పట్టుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం పక్కన నెమలి అరుస్తూ ఉన్న విషయాన్ని గమనించారు. అనంతరం నెమలిని అటవీశాఖ అధికారులకు అప్పగించడంతో మున్సిపల్ చైర్మన్‌ను స్థానికులు అభినందించారు.

అర్హులను సక్రమంగా గుర్తించాలి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: డబుల్ బెడ్‌రూం ఇళ్ల అర్హుల జాబితాలో తప్పులు దొర్లాయని, వాటిని సరిచేయాలని బీజేపీ నాయకులు సోమవారం ఆర్డీవో శ్రీను నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల డబుల్ బెడ్ రూంల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో అనర్హులను అర్హులుగా గుర్తించారని అన్నారు. అర్హులైన వారిని అనర్హులుగా ప్రకటించారని ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. జీవనోపాధి కోసం వాహనాలు తీసుకుంటే వాటిని ఫోర్ వీలర్ ఉందని రిజెక్ట్ చేయడం, ఇల్లు లేకున్నా ఉన్నట్లు గుర్తించడం, సమగ్ర సర్వే ఆధారంగా అనర్హులుగా గుర్తించడం సరికాదన్నారు. అనర్హులుగా గుర్తించిన వారికి దరఖాస్తుల చేసుకునేందుకు సమయం ఇవ్వాలని వారు కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు సతీష్, విద్యాసాగర్ ఉన్నారు.

అందని హోమియో వైద్యం

- ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో 16 ఏళ్లుగా వైద్యుడి పోస్టు ఖాళీ
- ఫార్మసిస్టుతోనే సేవలు
- ఇబ్బందులు పడుతున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అలోపతి వైద్యాని కంటే హోమియో వైద్యంతోనే దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయనే నమ్మకం ప్రజలలో బాగా పెరిగింది. దీంతో ప్రజలు హోమియో వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని హోమియో ఆస్పత్రిలో వైద్యుడు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని హోమియో ఆస్పత్రిలో వైద్యులు రవీందర్‌రెడ్డి 16 ఏళ్ల క్రితం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇంత వరకు వైద్యుడి పోస్టు భర్తీ కాలేదు. 16 ఏళ్ల నుంచి ఆస్పత్రిలో ఫార్మాసిస్టుతోనే వైద్య సేవలు అందుతున్నాయి. ఫార్మాసిస్టు తనకు తెలిసిన వైద్యంతోనే రోగులకు మందులు అందిస్తున్నారు. కానీ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మాత్రం వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సరిపడా వైద్యం అందడం లేదు. హోమియోవైద్యంతో సైడ్ ఎఫెక్ట్ లేకపోవడంతో ప్రస్తుతం హోమియో వైద్యానికి డిమాండ్ ఏర్పడింది. 16 ఏళ్లలో పలుమార్లు వైద్యుల భర్తీ, బదిలీలు జరిగినా ఎల్లారెడ్డిలో మాత్రం వైద్యుడి పోస్టు భర్తీ కాలేదు. గత నెలలో పిట్లానికి చెందిన వైద్యుడు అశోక్‌కు ఎల్లారెడ్డిలో మూడు రోజుల పాటు విధులు నిర్వర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా ఆయన ఇంత వరకు ఎల్లారెడ్డిలో జాయిన్ కాలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు ఎల్లారెడ్డిలో హోమియో వైద్యుడ్ని నియమించాలని ఎల్లారెడ్డితో పాటు చుట్టు పక్కల మండలాల ప్రజలు కోరుతున్నారు..

ఇబ్బందులు పడుతున్నాం



ఎల్లారెడ్డి హోమియో ఆస్పత్రిలో వైద్యుడు లేక ఇబ్బందులు పడుతున్నాం. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి సరైన వైద్యం అందడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యుడిని నియమించాలి. – రషీద్, ఎల్లారెడ్డి

సరైన వైద్యం అందించాలి



మోకాళ్ల నొప్పులతో బాధపడే వాళ్లు చాలా మంది ఉన్నారు. వారిలో ఎక్కువ శాతం హోమియో వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్కడ వైద్యుడు లేని కారణంగా సరిగా వైద్యం అందడం లేదు. ఫార్మాసిస్టుపైనే ఆధార పడాల్సి వస్తోంది. – వెంకటేశం, ఎల్లారెడ్డి

ఇంకా జాయిన్ కాలేదు

ఎల్లారెడ్డి హోమియో ఆస్పత్రిలో 16 ఏళ్లుగా వైద్యుడి పోస్టు ఖాళీగా ఉన్న మాట వాస్తవం. దీనిని దృష్టిలో ఉంచుకుని గత నెలలో అశోక్ అనే వైద్యుడిని పిట్లం నుంచి ఎల్లారెడ్డికి వారానికి మూడు రోజులు రావాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ ఆయన ఇంత వరకు విధుల్లో జాయిన్ కాలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. – వెంకటేశ్వర్లు, ఆయూష్ విభాగం జిల్లా కో ఆర్డినేటర్, కామారెడ్డి

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి


మెల్లకుంటతండాలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘు


మదన్‌హిప్పర్గాలో .. సర్పంచ్ రాజు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. మెల్లకుంటతండాలో కొనసాగుతున్న కంటి వెలుగును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి వెలుగులో భాగంగా వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కంటి పరీక్షల తీరును ఆయన పరిశీలించారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మదన్ హిప్పర్గాలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని మదన్‌హిప్పర్గ సర్పంచ్ రాజుపటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కంటి పరీక్షలను చేసుకున్నారు. తెలంగాణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అవసరం ఉన్న వారికి కంటి శస్త్ర చికిత్సలు చేసి అద్దాలు ఉచితంగా అందిస్తారన్నారు. క్యాంప్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, సిబ్బంది రాజ్‌కుమార్, సందీప్, శోభ, గ్రామస్తులు తదితరులున్నారు.

139 మందికి పరీక్షలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బొమ్మన్‌దేవ్‌పల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో సోమవారం139 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు వైశాలి తెలిపారు. ఇద్దరికి అద్దాలు అందించి, మరో నలుగురికి ఆర్డర్ పెట్టామన్నారు.

లోపించిన పారిశుధ్యం


బేగంపూర్ తండాలో రోడ్డుపై మురుగు నీరు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బేగంపూర్ తండాలో మురుగు కాలువలు లేకపోవడంతో మురికి నీరు రోడ్లపైకి వస్తోంది. నడవడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు.

పశువైద్య శిబిరం ప్రారంభం


యాడారంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న నేతలు

బీబీపేట: పశుపోషణకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందిస్తుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ అన్నారు. యాడారంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరానికి ఆయన హాజరయ్యారు. అనంతరం గ్రామంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బలవంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం


రత్నగిరిపల్లిలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

మాచారెడ్డి: రత్నగిరిపల్లిలో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆ గ్రామ సర్పంచ్ శ్రీశైలం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగిరెడ్డి, కొమురయ్య, రమేశ్, రవి, శ్రీనివాస్, దేవరాజ్, తదితరులున్నారు.

సిమెంట్ రోడ్లతో గ్రామాలకు శోభ

భిక్కనూరు: సిమెంట్ రోడ్లతో గ్రామాలకు శోభ చేకూరుతోందని భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. సోమవారం సిద్దరామేశ్వరనగర్‌లో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ జనగామ శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మీనా దుర్గాబాబు, మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, ఉప సర్పంచ్ లత, కో–ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్‌శర్మ, నేతలు రమేష్ రెడ్డి సుధాకర్, బల్‌రాం పాల్గొన్నారు.

యాదవ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ


హన్మాజీపేట్‌లో భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో సోమవారం యాదవ సంఘం భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బోనాల సుభాష్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్‌తో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

భవానీపేటలో మల్లన్న దేవుని కల్యాణం


భవానిపేటలో కల్యాణం నిర్వహిస్తున్న యాదవులు


రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవాల్లో భాగంగా కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

లింగంపేట(ఎల్లారెడ్డి): భవానిపేటలో సోమవారం మల్లన్న దేవుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, మహిళలు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్‌లో రేణుకా ఎల్లమ్మ దశమ వార్షికోత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారి ఆలయం వద్ద పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రామాగౌడ్, గంగాగౌడ్ ఉన్నారు.

సోమర్యాగడితండాలో భోగ్ భండార్

ఎల్లారెడ్డి: సోమర్యాగడితండాలో సోమవారం భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాలాల్ దీక్షాధారులు నిర్వహించిన భోగ్ భండార్ కార్యక్రమానికి వైఎస్‌ఆర్‌టీపీ ఎల్లారెడ్డి నాయకురాలు జమునా రాథోడ్, బాపుసింగ్ మహారాజ్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు బద్యానాయక్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, సర్పంచ్ లకావత్ రవిలు హాజరయ్యారు. స్వాములు భోగ్ భండార్ నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహించారు.


మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌టీపీ నేత జమున

షరతుల్లేకుండా జీవనభృతి ఇవ్వాలి


దోమకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

దోమకొండ: షరతులు లేకుండా బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీడీ కార్మికులు మండల కేంద్రంలో బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక చాముండేశ్వరి ఆలయం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం(బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకటి, తెలంగాణ బహుజన బీడీ కార్మిక రాష్ట్ర అధ్యక్షుడు సిద్దరాములు మాట్లాడారు. బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టీ కార్మికులు, నెలసరి ఉద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా జీవనభృతి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన బీడీ కార్మికులలకు రూ.2016 జీవనభృతి ఇవ్వాలని లేకుంటే కార్మికులతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు


పెద్దకొడప్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు


సింగితం ఉన్నత పాఠశాలలో..

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నిజాంసాగర్ మండలం సింగితం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బాన్సువాడ మండలం బోర్లం పాఠశాలలో, మద్నూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. – పెద్దకొడప్‌గల్ /నిజాంసాగర్/బాన్సువాడ రూరల్/మద్నూర్

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు


బాన్సువాడలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పలుచోట్ల రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ల ఆయురారాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్


నాగిరెడ్డిపేట: కస్తూర్బా పాఠశాలలో..